



దివ్యాంగులకు స్మార్ట్ కార్డులు

- యూడీఐడీ కార్డుల జారీకి కేంద్రం నిర్ణయం
- సదరం సర్టిఫికెట్లకు బదులుగా జారీ చేయాలని ఆదేశాలు



తొర్రూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): దేశంలోని దివ్యాంగులంతా ఒకే వేదిక మీద రావాలన్న ఉద్దేశంతో దివ్యాంగుల ధ్రువీకరణ అంశంలో కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇంతకాలం దివ్యాంగులుగా గుర్తించేందుకు గానూ 'సదరం' సర్టిఫికెట్లను జారీ చేయగా ఆ విధానానికి ఇక నుంచి స్వస్తి పలకనుంది. సదరం సర్టిఫికెట్ల స్థానంలో యూనిక్ డిసెబిలిటీ ఐడీ కార్డు (యూడీఐడీ) స్మార్ట్ కార్డును తీసుకురావాలని కేంద్రం నిర్ణయించింది. ఇప్పటివరకు 7కేటగిరీల్లో ప్రభుత్వం దివ్యాంగులకు సర్టిఫికెట్ లు అందిస్తుండగా ఇక నుండి 21 కేటగిరీలకు సంబంధించిన యూడీ ఐడీ కార్డులు ఇవ్వనుంది. ఈ సేవలు అమలు చేసేందుకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైకల్య పరీక్షల నిర్వహణకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

వెబ్‌సైట్‌లో దరఖాస్తు

వైక్యం ఉన్న వ్యక్తులు ఇక నుండి సదరం (యూడీఐడీ) సర్టిఫికెట్ కోసం వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అప్లికేషన్ వెబ్‌సైట్ నుండి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాటా ఆపరేటర్ లాగిన్‌కు వెళ్తుంది. అందులో కేటగిరీల వారిగా ఉన్న జాబితాను వేరుచేసి క్యాంపులో వైద్య పరీక్షల కోసం స్లాట్స్ విడుదల చేస్తారు. 21రకాల వైకల్యాలకు సంబంధించిన వారు ఎప్పుడు రావాలి అనే తేదీలను ప్రకటిస్తారు. వీటిలో పార్ట్ ఏ, బీ ఉంటుంది. పార్ట్ ఏలో లబ్ధిదారుల వ్యక్తిగత సమాచారం, పార్ట్ బీలో వైకల్య వివరాలను క్యాంపులో డాక్టర్‌కు చూపించాల్సి ఉంటుంది. ఆయా విభాగాల్లో వైద్యులు పరీక్షించి వైకల్యం పర్సంటేజీని మెడికల్ బోర్డు లాగిన్‌లో అప్‌లోడ్ చేస్తారు. అప్పుడు ఈఐడీ పోర్టల్‌కు వెళ్తుంది. ఇందులో వైకల్యం పర్సంటేజీ వారిగా అందరికి కార్డులు అందజేస్తారు.

జిల్లా ఆస్పత్రిలో ఏర్పాటు

యూఐడీ విధానం అమలులోకి రానుండడంతో అందుకు సంబంధించిన ఏర్పాట్లలో జిల్లా అధికారులు నిమగ్నమయ్యారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆస్పత్రిలో యూఐడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే సంబంధిత డీఆర్‌డీఏ అధికారులు పరిశీలించారు. అందుబాటులో ఉన్న వైద్యుల వివరాలు, పరికరాలు ఇతర వివరాలను ఉన్నతాధికారులకు అందించారు.

ఆన్‌లైన్‌లో నిక్షిప్తం

యూఐడీ విధానం ద్వారా ఇకపై దేశవ్యాప్తంగా ఉన్న దివ్యాంగుల సమాచారం అంతా ఆన్‌లైన్‌లో నిక్షిప్తం కానుంది. నంబర్ ఎంటర్ చేస్తే సమాచారం మొత్తం వచ్చేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం స్వావలంబన్ పేరుతో పోర్టల్‌ను కూడా రూపొందించింది. దివ్యాంగులందరిని ఒకే వేదిక మీదకు తీసుకురావడం ద్వారా వారికి నిధులు కేటాయించాలన్న దానికి స్పష్టత వస్తుందని కేంద్ర ప్రభుత్వం భావిస్తుంది. కేంద్రం ఆలోచన దీనితో పాటు దివ్యాంగుల గుర్తింపు వారికి అందుతున్న సంక్షేమ పథకాల వివరాలు పారదర్శకంగా ఉంటాయని తెలుస్తుంది. జిల్లాలో 1,07,967 మంది సదరం పెన్షన్ దారులు ఉండగా వారిలో 15,6 00 మంది దివ్యాంగుల పెన్షన్ పొందుతున్నారని అధికారులు తెలిపారు.



మహబూబాబాద్
హోలీ వేడుకల్లో ఎస్పీని ఎత్తుకొని నృత్యాలు చేస్తున్న పోలీస్ అధికారులు

హోలీ.. రంగుల కేళి





కేసముద్రంలో హోలీ వేడుకల్లో పాల్గొన్న మహిళలు

జిల్లాలో అంబరాన్నంటిన హోలీ సంబరాలు

- వీధివీధిన యువకుల కోలాహలం
- పాల్గొన్న సకల జనులు, ప్రముఖులు
- భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక హోలీ : ఎస్పీ సుధీర్‌రాంనాథ్‌కేకన్

జిల్లాలో శుక్రవారం హోలీ వేడుకలను ఆనందోత్సవాల నడుమ జరుపుకున్నారు. రంగురంగుల కలర్లతో జిల్లా వ్యాప్తంగా కళకళలాడింది. జిల్లా కేంద్రం పరిధిలోని అన్ని కాలనీలు, ప్రధాన కూడళ్లలో కుల, మతాలకు అతీతంగా స్త్రీ, పురుష, చిన్న, పెద్ద, పేద, ధనిక అనే తారతమ్యం, వయసుతో సంబంధం లేకుండా సకల జనులు హోలీ సంబరాల్లో పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలో యువత సందడి అంతాఇంతా కాదు. ఉదయం 7 గంటల నుంచి పట్టణంలోని ఏ వీధి చూసినా హోలీ సందడితో హోరెత్తించారు. ఒకరి ముఖానికి మరొకరు రంగులు పూసుకుంటూ ఆత్మీయత, అనురాగాన్ని పంచుకున్నారు. పలు చోట్ల హోలీ ఈవెంట్లు సైతం ఏర్పాట్లు చేశారు. డీజే సాంగ్స్‌తో కుర్రకారు ఉర్రూతలూగారు.

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, (ఆంధ్రజ్యోతి)



మహబూబాబాద్ సెవెన్‌హిల్స్‌లో హోలీ వేడుకల్లో పాల్గొన్న మహిళలు, పురుషులు



సీరోలు మండలం కాంపల్లిలో హోలీ వేడుకల్లో పాల్గొన్న యువకులు



మహబూబాబాద్ శివారు అనంతారంలో హోలీ వేడుకల్లో రంగులు పూసుకుంటున్న చిన్నారులు

నేటి నుంచి ఒక్క పూట బడులు షురూ..

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాల పాఠశాలలకు ఈ నెల 15 నుంచి ఒక్క పూట బడులు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఒక్కపూట బడుల నిర్వహణ షెడ్యూల్‌ను విడుదల చేసి జిల్లా విద్యాశాఖాధికారులను ఆదేశాలు జారీ చేసింది. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పాఠశాల నిర్వహించేందుకు సమయ పాలనను రూపొందించారు. 12:30 మధ్యాహ్న భోజనం అందించి విద్యార్థులను ఇంటికి పంపించనున్నారు. ఈ నెల 21 నుంచి పదవ తరగతి వార్షిక పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్ష సెంటర్లు ఉన్న పాఠశాలలను మధ్యాహ్నం 1 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహించనున్నారు. పరీక్ష సెంటర్లు ఉన్న పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్నం 1 గంటలకు భోజనం అందించి తరగతులు నిర్వహించనున్నారు.

సాంకేతికతతో అక్రమాలకు చెక్

- 'ఇందిరమ్మ' ఇళ్లకు జియో ఫెన్సింగ్
- జిల్లాకు 8వేలకుపైగా ఇళ్లు మంజూరు

వివరాలు 6లో..




గూడూరు ఎంపీడీవో కార్యాలయంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ నమూనా ఇల్లు

సద్దిమూట.. సల్లంగుండ..

అన్నదాతలకు ఆకలి తీర్చుతున్న పథకం

- హరే కృష్ణ చారిటబుల్ ఫౌండేషన్ సమకారం
- కేసముద్రం, మహబూబాబాద్ మార్కెట్ జయవంతంగా అమలు
- రూ.5కే రుచికరమైన భోజనం



మహబూబాబాద్ మార్కెట్‌లో సద్దిమూట వద్ద భోజనం కోసం రైతుల భారీ క్యూలైన్

మహబూబాబాద్ అగ్రికల్చర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : అన్నదాత సుఖీభవ అని పట్టెడు అన్నంపెట్టే వారిని దీవిస్తుంటారు.. పంటలను పండించి అందరికి ఆహారం అందించే అన్నదాతల కడుపు నింపేందుకు సద్దిమూట కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతోంది. జిల్లాలోని ప్రత్యేక్ష కొనుగోళ్ల వ్యవసాయ మార్కెట్‌లో అమలవుతున్న సద్దిమూట పథకం (రూ.5కే భోజనం) విజయవంతంగా అమలవుతోంది. వ్యవసాయ మార్కెట్లకు సరుకులు తీసుకువచ్చి అర్థాకలితో ఆలమటిస్తున్న రైతులకు ఈ సద్దిమూట పథకం ఓ వరంలా రైతుల ఆకలి తీర్చుతుంది. మహబూబాబాద్, కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లలో ఈ పథకం విజయవంతంగా అమలవుతుండడంతో రైతుల నుంచి హర్షాతిరేఖాలు వ్యక్తమవుతున్నాయి. పట్టణ ప్రాంతాల్లోని ముఖ్య కూడలిలో, ప్రధాన ఆస్పత్రుల్లో, మునిసిపాలిటీ పరిధిలో అమలవుతున్న ఈ భోజన పథకం వ్యవసాయ మార్కెట్లలోనూ అమలు చేస్తున్నారు.



మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో భోజనం చేస్తున్న రైతులు

మొదట కేసముద్రం మార్కెట్‌లో ప్రారంభం..

2019లో చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొదట కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో ఈ పథకాన్ని అమలు చేయడం జరిగింది. మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో ఈ ఏడాది జనవరి 24న రాష్ట్ర ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచందర్‌నాయక్, మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్‌లు ప్రారంభించారు. ఈ పథకం ప్రారంభించిన నాటి నుంచి రైతుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. కేసముద్రంలో ప్రతిరోజు 480 మంది రైతులకు సద్ది మూట పథకం ద్వార ఆకలి తీర్చుతున్నారు. మహబూబాబాద్ మార్కెట్‌లో 360 మంది రైతుల వరకు ఈ పథకం ద్వార లబ్ధిపొందుతున్నారు. మార్కెట్ చైర్మన్లు గంటా సంజీవరెడ్డి, సుధాకర్‌ల పర్యవేక్షణలో ఈ భోజన పథకం అమలవుతోంది.

ఇతర జిల్లాల నుంచి...

మహబూబాబాద్, కేసముద్రం వ్యవసాయ మార్కెట్లకు ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం, నల్గొండ, సూర్యాపేట ప్రాంతాల నుంచి రైతులు తాము పండించిన ఉత్పత్తులను ఈ మార్కెట్‌కు తీసుకువస్తున్నారు. మిర్చి సీజన్‌లో మహబూబాబాద్, కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లలో మూడ్రోజుల వరకు యార్డులోనే రైతులు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉంటుంది. అలాంటి పరిస్థితుల్లో రైతులకు రుచికరమైన రూ.5లకే భోజన పథకం ఎంతో ఉపయోగపడుతూ.. రైతుల ఆకలి తీర్చుతుంది.



కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో రైతుల కలిసి భోజనం చేస్తున్న మార్కెట్ చైర్మన్ సంజీవరెడ్డి

ప్రతిరోజు ఏనుమాముల మార్కెట్ నుంచి..

ప్రతిరోజు హరేకృష్ణ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏనుమాముల మార్కెట్‌లో వండిన భోజనం ముందుగా కేసముద్రం మార్కెట్‌కు, ఆ తర్వాత మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు వాహనాల్లో తీసుకువస్తున్నారు. ఒక్క భోజనం రూ.27.63ల వరకు మార్కెట్ శాఖ నుంచి ఫౌండేషన్ వసూలు చేయనుంది. అయితే రైతులు రూ.5 చెల్లిస్తే రూ.22.63లు మార్కెట్‌శాఖ ఫౌండేషన్‌కు చెల్లిస్తుంది. ప్రతీ రోజు ఒక కూర, సాంబర్, చట్నీతోపాటు 400 గ్రాముల అన్నం పెడతారు. మొత్తం మీద ఈ సద్దిమూట పథకం మార్కెట్‌లలో విజయవంతంగా రైతుల ఆకలి తీర్చుతుంది.

భోజనం బాగుంది..

బానోత్ లక్ష్మి, మహిళ రైతు, లక్ష్మిపురం



తన వ్యవసాయ భూమిలో మిర్చిని పండించి కేసముద్రం మార్కెట్‌కు విక్రయించేందుకు తీసుకువచ్చా.. మధ్యాహ్నం ఇంటి నుంచి భోజనం తీసుకురాలేదు. తోటి రైతులు రూ.5లకే భోజనం పెడుతున్నారని చెప్పడంతో అక్కడికి వెళ్లి భోజనం చేశా.. భోజనం రుచికరంగానే ఉంది.

సాంకేతికతతో అక్రమాలకు చెక్

- 'ఇందిరమ్మ' ఇళ్లకు జియో ఫెన్సింగ్
- సర్వేలో చూపిన చోటనే నిర్మించాలి
- పథకం అమలులో ఏఐ టెక్నాలజీతో యాప్
- జిల్లాకు 8వేలకు పైగా ఇళ్లు మంజూరు
- 11 మండలాల్లో సిద్ధమవుతున్న నమూనా ఇళ్లు
- ప్రయోగాత్మక గ్రామాల్లో అవగాహన సదస్సులు

కేసముద్రం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకంలో అవకతవకలకు, అవినీతికి ఆస్కారం లేకుండా అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలో ఇళ్ల పథకంలో సాంకేతికత అందుబాటులో లేక నిర్మించిన ఇళ్లనే మళ్లీ నిర్మించినట్లుగా పత్రాలు సృష్టించి అనేక మంది బిల్లులు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి అక్రమాలకు కొంతమంది అధికారులకు గ్రామాల్లో పలువురు దళారులు తోడై బినామీ లబ్ధిదారులతో కుమ్మక్కై ఇళ్ల బిల్లులు స్వాహా చేసినట్లు తెలుస్తోంది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేసేందుకు సిద్ధమైన విషయం తెలిసిందే.



కేసముద్రం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్మాణం అవుతున్న ఇందిరమ్మ నమూనా ఇల్లు

ఈ పథకంలో దరఖాస్తుల స్వీకరణ చేయగా కొన్ని మండలాల్లో ఉన్న ఇళ్ల కంటే అధికంగా దరఖాస్తులు రావడం గమనార్హం. గతంలో మాదిరిగా ఇళ్ల పథకంలో ఇల్లు కట్టకున్నా బిల్లులు తీసుకోవచ్చనే దురాశతో కొంతమంది ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఇప్పుడున్న సాంకేతిక పరిజ్ఞానంతో అమలు చేయబోతున్న ఈ పథకంలో ఇలాంటి అవకతవకలకు, అవినీతికి ఆస్కారమే లేదని అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో 2.47లక్షల దరఖాస్తులు

మహబూబాబాద్ జిల్లాలో 18 మండలాల్లో 1.89 లక్షల దరఖాస్తులు రాగా, నాలుగు మునిసిపాలిటీల్లో 28వేలు, ఇటీవలే చివరి దఫాలో మరో 30వేల దరఖాస్తులు వెరసి 2.47 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఇందిరమ్మ పథకం అమలు కోసం తొలి దశలో మండలానికో ప్రయోగాత్మక గ్రామాన్ని ఎంచుకొని 18 గ్రామాల్లో 1,488 దరఖాస్తులను పరిశీలనకు తీసుకున్నారు. వీటిని మళ్లీ అన్ని కోణాల్లో పరిశీలించి ఇందులో అనర్హులను తొలగించి, ఖాళీ స్థలం ఉన్నవారిలో నిరుపేదలకు ప్రాధాన్యతనిస్తూ లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారు. జిల్లాలో నియోజకవర్గానికి 3,500 చొప్పున పూర్తిస్థాయి నియోజకవర్గాలైన మహబూబాబాద్, డోర్నకల్‌లకు 7వేల ఇళ్లు, సరిహద్దులో జిల్లా పరిధిలోకి వచ్చే పాక్షిక నియోజకవర్గాలైన పాలకుర్తి, ములుగు, ఇల్లెందు నుంచి మరో వెయ్యి వరకు వెరసి 8వేలకు పైగా ఇళ్లు మంజూరు కానున్నాయి. ఒక్కో ఇంటి నిర్మాణానికి పలు విడతలుగా రూ.5లక్షలను మంజూరు చేయనున్నారు.

ఏఐ టెక్నాలజీతో అక్రమాలకు చెక్..

ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తూ కృత్రిమ మేధ(ఏఐ)తో పనిచేసే యాప్‌ను రూపొందించారు. లబ్ధిదారుల జాబితాలను ఎల్1, ఎల్2, ఎల్3 మూడు భాగాలుగా విభజించారు. ఇల్లు లేకుండా సొంతస్థలం ఉన్నవారిని ఎల్1 జాబితాలో, స్థలం లేని వారిని ఎల్2, ఇల్లు ఉండి స్థలం లేనివారిని ఎల్3లో చేర్చారు. తొలుత ఎల్1 జాబితాలో ఉన్నవారిని 360 డిగ్రీల సాఫ్ట్‌వేర్‌తో పరిశీలించి అర్హులను తేలుస్తున్నారు. ఎల్1 జాబితాలో ఒంటరి మహిళలకు, దివ్యాంగులకు, వితంతువులకు, అనాథలకు, అత్యంత పేదరికంలో ఉన్నవారికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం సూచించినట్లు అధికారులు చెబుతున్నారు.

సర్వే కోసం రూపొందించిన యాప్‌లో దరఖాస్తుదారులు ఎక్కడైతే తమ ఖాళీస్థలం ఇదేనని చూపుతూ ఫొటో దిగారో ఆ స్థలానికి అక్షాంశ, రేఖాంశాల ఆధారంగా జియో ఫెన్సింగ్‌ను నిర్ణయించి సదరు అర్జీదారుడి పేరిట జియో ట్యాగింగ్ చేస్తారు. దీంతో ఒకవేళ అర్జీదారుడు ఇందిరమ్మ పథకానికి ఎంపికైతే తప్పనిసరిగా అదే స్థలంలో ఇల్లును నిర్మించాల్సి ఉంటుంది. ఇంటి నిర్మాణ వివరాలను లబ్ధిదారుడు ఆ స్థలంలో నిల్చొని అప్‌లోడ్ చేస్తేనే యాప్ తీసుకుంటుంది. మరోచోటు చూపిస్తే తిరస్కరిస్తుంది. జియో ఫెన్సింగ్ విధానంలో మరో చోట ఇల్లును నిర్మించేందుకు వీలుండదు. పాత ఇంటిని మళ్లీ కట్టినట్లుగా చూపేందుకు అవకాశం లేదు.

సిద్ధమవుతున్న నమూనా ఇళ్లు..

ఇక జిల్లాలోని 18 మండలాల్లో 11 మండలాల్లో ఆయా మండల ప్రజాపరిషత్ కార్యాలయాల్లో ఇందిరమ్మ ఇంటి నమూనా నిర్మాణాలు వేగంగా కొనసాగుతున్నాయి. పిల్లర్లు లేకుండా కేవలం సిమెంటు ఇటుకలతో హాల్, కిచెన్, బెడ్‌రూం, తదితర సౌకర్యాలతో నిర్మాణం స్లాబ్ స్థాయి వరకు పూర్తయ్యాయి. సాధ్యమైనంత తొందరగా నమూనా ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తామని హౌసింగ్ డీఈ రాజయ్య తెలిపారు. మరోవైపు ప్రయోగాత్మక గ్రామాల్లో తాజాగా ఎంపిక చేసిన జాబితాలోని లబ్ధిదారులకు ఇందిరమ్మ పథకం నిబంధనలపై అవగాహన కార్యక్రమాలను అధికారులు నిర్వహిస్తున్నారు. సర్వేలో చూపిన స్థలంలో రేకుల షెడ్డు, ఇతర నిర్మాణాలు ఏవీ ఉన్నా వాటిని తొలగించి పునాదుల నుంచి నిర్మిస్తూ ఎప్పటికప్పుడు యాప్‌లో అప్‌లోడ్ చేస్తేనే బిల్లులు వస్తాయని లబ్ధిదారులకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఏదేమైనా గతంలో మాదిరిగా అవకతవకలు జరగకుండా ఇందిరమ్మ ఇళ్ల పథకంలో నూతన సాంకేతికతను వినియోగిస్తూ నిజమైన లబ్ధిదారులకు మేలు జరుగుతుందని పలువురు భావిస్తున్నారు.



కేసముద్రం మండలం గాంధీనగర్‌లో ఈనెల 5న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేస్తున్న గ్రామాలు

మండలం	గ్రామం	పరిశీలించిన దరఖాస్తులు
బయ్యారం	నామాలపాడు	128
గార్ల	బీఆర్ఎస్‌తండా	49
గంగారం	కొడిశెలమిట్ట	117
కొత్తగూడ	మొండ్రాయిగూడెం	111
పెద్దవంగర	పోచారం	88
తొర్రూరు	ఖానాపూర్	139
గూడూరు	శ్రీహనుమాన్‌తండా	153
ఇనుగుర్తి	పాతతండా	35
కేసముద్రం	గాంధీనగర్	70
మహబూబాబాద్	సండ్రాలగూడెం	110
నెల్లికుదురు	హేమ్లతండా	87
చిన్నగూడూరు	తుమ్మలచెరువుతండా	57
దంతాలపల్లి	రామవరం	72
డోర్నకల్	కన్నెగుండ్ల	45
కురవి	కొత్తూరు-జి	58
మరిపెడ	లునావత్‌తండా	16
నర్సింహులపేట	వంతడుపుల	106
సీరోలు	బూరుగుచెట్టుతండా	47
మొత్తం		1,488



వైభవంగా వేంకటేశ్వర స్వామి తిరుక్కల్యాణం

వెంకటాపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలో వేంచేసి ఉన్న వేంకటేశ్వర స్వామి తిరుక్కల్యాణ మహోత్సవం శుక్రవారం భక్తజన సందోహం మధ్య వైభవంగా జరిగింది. ఉదయం అర్చకుల మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాలు, భక్తజన జయజయ ధ్వానాల మధ్య తిరుక్కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచే కాకుండా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ చలువ పందిళ్లు, మంచినీరు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసింది. భక్తులకు భగవాన్ సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో తాగునీటి సౌకర్యం కల్పించారు.

చాక్లెట్ డబ్బాల్లో స్లిప్‌లు సం'క్షేమం'

- వెల్ఫేర్ సంఘాల ఐడియా..!



ధన్నసరి సొసైటీ క్యాష్ కౌంటర్‌లో స్లిప్‌లు వేసేందుకు ఏర్పాటు చేసిన డబ్బాలు

కేసముద్రం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఫొటోలో కనిపిస్తున్న చాకెట్లు, బిస్కెట్లు నిల్వ చేసే ఈ డబ్బాలు కేసముద్రంలోని ధన్నసరి సొసైటీ క్యాష్‌కౌంటర్ కార్యాలయంలో ఏర్పాటు చేయడంతో బ్యాంకుకు వచ్చిన వారు వీటిని ఆసక్తిగా పరిశీలిస్తున్నారు. ఈ బ్యాంకులో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఫ్రెండ్స్, వివిధ కులాల సంక్షేమ సంఘాలకు చెందిన వందకుపైగా ఖాతాలున్నాయి. ఇందులో సుమారు 45 సంఘాలు క్రియాశీలకంగా కొనసాగుతున్నాయి. ఈ సంఘాలకు ప్రతీనెల మొదటి రెండు వారాల్లో డిపాజిట్లు స్వీకరించడం, రుణాలివ్వడం సొసైటీ బ్యాంకు ద్వారానే చేస్తుంటారు. వివిధ సంఘాల్లోని సభ్యులు డిపాజిట్లు, రుణాలు చెల్లించిన రశీదులను ఆయా సంఘాల కోశాధికారులకు అందజేయాల్సి ఉంటుంది. ఈ రశీదులను భద్రపర్చేందుకు సంఘాల ఆధ్వర్యంలో డబ్బాలను ఏర్పాటు చేసి ఆ డబ్బాపై సంఘం పేరును సూచించే స్టిక్కర్లు అంటించారు. నగదు చెల్లించిన రశీదులను ఆయా అసోసియేషన్ డబ్బాల్లో సభ్యులు వేస్తుండడంతో స్లిప్‌లు క్షేమంగా సంఘానికి చేరుతున్నాయి.



నిరాహార దీక్షకు సంఘీభావం తెలుపుతున్న గండ్ర వెంకటరమణారెడ్డి

మాదిగలకు న్యాయం చేయాలి

- భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

టేకుమట్ల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ వర్గీకరణ చేసి మాదిగలకు న్యాయం చేయాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ పూర్తి చేసిన తర్వాతే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండల కేంద్రంలో చేపట్టిన నిరాహారదీక్ష శుక్రవారం ఐదో రోజుకు చేరుకుంది. గండ్ర వెంకటరమణారెడ్డి బీఆర్ఎస్ నాయకులతో కలిసి దీక్షాపరులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా మాదిగలకు ఇచ్చిన హామీని అమలు చేయకుండా నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు రాంరాంచందర్, మచ్చ శ్రీకాంత్, అంబాల అనిల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవి, మండల ప్రధాన కార్యదర్శి ఆకునూరి తిరుపతి, బీఆర్ఎస్, ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్, ఎంఎస్పీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చేపల వల చుట్టుకొని మత్స్యకారుడి మృతి

రాయపర్తి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు మృతి చెందిన ఘటన మండలంలో జరిగింది. ఎస్సై శ్రావణ్ కుమార్ కథనం ప్రకారం.. రాయపర్తి మండలంలోని మైలారం గ్రామానికి చెందిన మత్స్యకారుడు బాద వెంకన్న(39) గురువారం రాత్రి గ్రామ శివారులో సర్వాలకుంటలో చేపలు పట్టేందుకు మిత్రులతో కలిసి వెళ్లాడు. చెరువులో వల వేసి బయటకు వచ్చే క్రమంలో వల చుట్టుకొని నీళ్లలో మునిగిపోయాడు. ఒడ్డుకు చేరుకున్న మిత్రులు వెంకన్న బయటికి రాకపోవడంతో చెరువులో గాలించగా ఆయన మృతదేహం దొరికింది. వెంకన్న భార్య అనిత ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఈ రవీందర్‌రెడ్డి ఆర్థిక సాయం అందించారు.

కమనీయం.. స్వామి వారి కల్యాణం..

- వైభవంగా వేంకటేశ్వర, పద్మావతి అలువేలుమంగ వివాహం
- పాల్గొన్న ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్ దంపతులు
- వివిధ జిల్లాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు



మంగళసూత్రం చూపుతున్న అర్చకుడు నందనాచార్యులు

నర్సింహులపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం శివారు ఇంద్రకీలాద్రి పర్వతంపై కొలువుదీరిన పద్మావతి సహిత అలువేలు మంగ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం శుక్రవారం రాత్రి భక్తజన సందోహం మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. ప్రధాన అర్చకులు పవన్‌కుమారచార్యులు, శ్రీనివాసచార్యులు, శ్రీనందనా చార్యులు, రామాచార్యులు, అజయ్‌చార్యుల అర్చక బృందం ఆధ్వర్యంలో స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ఆలయం గర్భగుడి పైనుంచి కిందకు తీసుకువచ్చి పల్లకిపై ఏర్పాటు చేసి ఖమ్మం పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి తల్లాడ రమేష్-ఉషారాణి తెప్పించిన అలంకరణ సామగ్రితో అలంకరించారు. గరుడవాహనంపై స్వామి వారిని ఊరేగిస్తూ ఎదురుకోలు కార్యక్రమం అనంతరం అర్చక బృందం వేదమంత్రోచ్చారణ నడుమ పాల్గుణ శుద్ధ నిండు పౌర్ణమి అర్ధరాత్రి వేంకటేశ్వర స్వామితో, పద్మావతి, అలువేలు మంగకు కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు మండలం నుంచే కాకుండా కురవి, మరిపెడ, నెల్లికుదురు, డోర్నకల్, కేసముద్రం, మహబూబాబాద్, వరంగల్, ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారి కల్యాణోత్సం తిలకించారు. బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి అవాంచనీయ ఘటనలకు తావులేకుండా ఎస్సై మాలోతు సురేష్ పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ రాంచంద్రు నాయక్, ప్రమీల దంపతులు, ఆలయ ఈవో వేణుగోపాల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జినుకల రమేష్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు బానోతు దస్రూనాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజశేఖర్, సోమిరెడ్డి, రేఖ అనీల్, గౌని యాదగిరి, ఉల్లి శ్రీను, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



వేంకన్న కల్యాణానికి హాజరైన భక్తులు



వేడుకలకు హాజరైన విప్ రాంచంద్రునాయక్, ప్రమీల దంపతులు

జాతీయ రహదారికి పచ్చల హారం

- ములుగు ఎన్‌హెచ్‌కు మహర్దశ
- జవహర్‌నగర్ నుంచి మహ్మద్‌గౌస్‌పల్లి వరకు గ్రీనరీ
- ఇరువైపులా 20 కిలోమీటర్ల పొడవునా మొక్కల పెంపకం
- నర్సరీల్లో సిద్ధం చేసిన మొక్కలు



ప్రేమనగర్ వద్ద జాతీయ రహదారికి ఇరువైపులా చదును చేయిస్తున్న అటవీశాఖ అధికారులు

ములుగు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌హెచ్-163.. జిల్లాలో ఉన్న ఏకైక జాతీయ రహదారి. హైదరాబాద్ నుంచి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని భూపాలపట్నాన్ని కలిపే ఈ హైవే అనేక మార్పులతో ముస్తాబవుతోంది. ఏటూరునాగారం ముల్లకట్ట వద్ద గోదావరిపై అంతర్రాష్ట్ర వంతెన నిర్మాణంతో 15ఏళ్ల క్రితం మొదలైన ప్రగతి ప్రస్తుతం నాలుగు లేన్లుగా విస్తరించడం వరకు కొనసాగింది. పస్రా - ఏటూరునాగారం మధ్య మినహా ఈ నాలుగు వరుసల రహదారి పనులలో పెద్దఎత్తున వృక్షాలు తొలగించబడ్డాయి. దీంతో బోసిబోయిన రహదారిని పచ్చల హారంతో అలంకరించేందుకు జిల్లా అటవీ శాఖ కార్యాచరణ రూపొందించింది. పెకిలించిన వృక్షాలకు అనేక రెట్ల మొక్కలను నాటాలని నిర్ణయించింది. ఆ పనులు ఇప్పుడే పట్టాలెక్కాయి.



అటవీశాఖ కార్యాలయ ఆవరణలో ఉన్న ట్రీగార్డులు

20 కిలోమీటర్లు.. 12వేల మొక్కలు

మొదటి దశలో 20 కిలోమీటర్ల రహదారి పొడవునా మొక్కలు నాటనున్నారు. జిల్లాకు ప్రారంభ గ్రామమైన మల్లంపల్లి మండలం మహ్మద్‌గౌస్‌పల్లి నుంచి వెంకటాపూర్ మండలం జవహర్‌నగర్ టోల్‌గేట్ వరకు రోడ్డుకు ఇరువైపులా 12 వేలకు పైగా మొక్కలు నాటాలని నిర్ణయించారు. స్థలం తక్కువగా ఉన్న చోట్ల రెండు వరుసలు, ఎక్కువగా ఉన్న చోట నాలుగు వరుసల వరకు నాటనున్నారు. ఇందుకోసం రూ.70లక్షల నుంచి రూ.80లక్షల వరకు ఖర్చవుతాయని అంచనా.

పండ్లు, నీడనిచ్చే వృక్షజాతులు

దురిశెన, పట్నం తంగేడు, మర్రి వృక్షాలతో ములుగుకు వచ్చే రహదారి ఒకప్పుడు ఆహ్లాదకరంగా ఉండేది. ఎన్నో పక్షులు, జంతువులకు నిలయంగా ఉపయోగపడేవి. జనం సుదీర్ఘ ప్రయాణంలో సేద తీరేందుకు ఆగేవారు. కానీ ఇప్పుడా చెట్లు లేకపోవడంతో జాతీయ రహదారి పొడవునా ఎండమావులు కనిపిస్తున్నాయి. అడవిని వదిలి జనావాసాల్లోకి వచ్చిన కోతులు రోడ్డుపైకి చేరుతున్నాయి. నిలువ నీడలేక, తిండిలేక అలమటిస్తున్న వానరాలు ప్రయాణీకులపై దాడికి పాల్పడుతుండటమే కాకుండా ఆహార అన్వేషణలో వాహనాల కిందపడి ప్రాణాలు కోల్పోతున్నాయి. అటవీశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న మొక్కల పెంపకంతో మునుపటి రోజులు మళ్లీ అవిష్కృతం కానున్నాయి. నీడనివ్వడంతోపాటు పశుపక్షాదులకు మేత, ఫలాలను ఇచ్చే మహాగని, రావి, మర్రి, జువ్వి వంటి వివిధ జాతుల మొక్కలను నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు.



జాకారం నర్సరీలో సిద్ధం చేస్తున్న మొక్కలు

నర్సరీల్లో సిద్ధంగా మొక్కలు

ములుగు మండలం జాకారంలోని నర్సరీలో మొక్కలను సిద్ధం చేశారు. జాతీయ రహదారి ఇరువైపులా చదును పనులు చేపడుతున్నారు. గుంతలు తీసే కార్యక్రమం మొదలైంది. ఈ వారంలో మొక్కలు నాటే ప్రక్రియ ప్రారంభించనున్నారు. మొక్కల సంరక్షణ కోసం అవసరమైన ప్లాస్టిక్ ట్రీగార్డులను ఇప్పటికే తెప్పించారు. వేసవిలో మొక్కలు ఎండిపోకుండా నీరు పోసేందుకు ట్యాంకర్లను సిద్ధం చేస్తున్నారు. ప్రత్యేక సిబ్బందిని నియమించి పర్యవేక్షించనున్నారు.

హక్కులతో.. మోసాలకు చెక్

- మోసాలమయంగా మార్కెట్.. అడుగడుగునా దగా
- ప్రజలను ఆకట్టుకునేందుకు వ్యాపారుల ఎత్తులు
- నేడు జాతీయ వినియోగదారుల హక్కుల రక్షణ దినం



హనుమకొండ, మార్చి 14(ఆంధ్రజ్యోతి) : ఇప్పుడంతా మార్కెట్ మాయాజా లం నడుస్తోంది. చాలామంది వ్యాపారులు స్వార్థం కోసం మోసాలకు పాల్పడుతున్నారు. వినియోగదారులను ఆకట్టుకునేందుకు రకరకాల ఎత్తులు వేస్తున్నారు. లాభార్జనే ధ్యేయంగా అనేక అడ్డదారులు తొక్కుతున్నారు. తూకాల్లో మోసం.. కొలతల్లో దగా. నాణ్యతలేని వస్తువులు అంటగడట్టం లాంటివి చేస్తూ జేబులు నింపుకొంటున్నారు. ఇవన్నీ తెలియని వినియోగదారుడు ఆర్థికంగా నష్టపోతున్నాడు. కల్తీ ఆహారపదార్థాలతో ఆరోగ్యాన్ని కోల్పోతున్నాడు. తనకు జరిగిన మోసంపై వినియోగదారుల ఫోరంలలో ఫిర్యాదులు చేయకపోవడం వల్ల వ్యాపారుల అక్రమాలకు అడ్డూ అదుపులేకుండా పోతోంది. ఇలాంటి మోసాలకు తమకున్న హక్కులతో చెక్‌పెట్టొచ్చన్న

వినియోగదారుల చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

విషయాన్నితెలుసుకోవాలి. ఈ క్రమంలో ప్రతీ వినియోగదారుడు తన హక్కుల గురించి సరైన అవగాహన పెంచుకోవాలి. 1962 మార్చి 15న అమెరికా దిగువ సభలో వినియోగదారుల హక్కుల బిల్లును ప్రతిపాదించగా అమెరికా మాజీ అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెనడి అమెరికా ప్రజలకు మొదటిసారిగా నాలుగు వినియోగదారుల హక్కులను ప్రకటించారు.

1982లో చేసిన తీర్మానం మేరకు ప్రతీ సంవత్సరం మార్చి 15ను ప్రపంచ వినియోగ దారుల దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా మారింది. శనివారం ప్రపంచ వినియోగదారుల హక్కుల పరిరక్షణ దినం సందర్భంగా ప్రత్యేక కథనం.



ఎనిమిది హక్కులు ఏంటంటే..

వినియోగదారుల కోసం చట్టబద్ధంగా ఎనిమిది హక్కులను కల్పించారు. తొలుత నాలుగు హక్కులనే కల్పించారు. ఆ తర్వాత మరో రెండు హక్కులను జత చేశారు. తదనంతర కాలంలో వినియోగదారుల సంఘాల నుంచి వచ్చిన ఒత్తిళ్ల మేరకు అదనంగా మరో రెండు హక్కులను కూడా జాబితాలో చేర్చారు. ప్రస్తుతం ఒక్క భారత దేశంలో తప్ప ప్రపంచంలోని మిగతా అన్ని దేశాల్లో ఈ ఎనిమిది హక్కులు అమలవుతున్నాయి. భారత దేశంలో ఇప్పటికీ ఆరు హక్కులు మాత్రమే అమలులో ఉన్నాయి. మిగతా ఈ రెండు హక్కులను కూడా కల్పించాలని చాలా కాలంగా వినియోగదారుల సంఘాలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి.

వినియోగదారుల హక్కుల ఇలా...

సమాచార హక్కు : వినియోగదారులు కొనే వస్తువులు, పొందే నాణ్యత పరిణామం, ధరల గురించి సంపూర్ణ సమచారం పొందడం కూడా ఒక హక్కే. నిర్ణయం తీసుకునే ముందు ఈ సమాచారాన్ని తప్పకుండా తెలుసుకోవాలి. అలాగే అనేక రకాల వస్తువులు, సేవలను తగిన, సరసమైన ధరలలో పొందటం వినియోగదారుల హక్కు. లభిస్తున్న వస్తువులు, సేవలలో ఏది పొందాలనే ఎంపిక హక్కు కూడా ఉంది.

ప్రాతినిధ్యం హక్కు : వినియోగదారుల సంక్షేమా ర్థం వినియోగదారులు ఎవరైనా సరే వినియోగదా రుల వేదికలపై అభిప్రాయాన్ని వినిపించవచ్చు. ప్రభుత్వం ఇతర సంస్థలు ఏర్పాటు చేసే పలు సంఘాల్లో ప్రాతినిధ్యం పొందగల రాజకీయేతర, వాణిజ్యేతర వినియోగదారుల సంఘాలను ఏర్పరుచుకోవడం ప్రాథమిక హక్కు. అలాగే అన్ని విషయాలు తెలిసినవారు కావడానికి తగిన విజ్ఞానం, నైపుణ్యం, జీవన పర్యంతం పొందడం కూడా హక్కే.

న్యాయం పొందే హక్కు : అన్యాయమైన వాణిజ్య విధానాలు, మోసపూరిత పద్ధతుల నుంచి న్యాయబద్ధమైన రక్షణ పొందవచ్చు. న్యాయ సమ్మతమైన ఫిర్యాదులను నమోదు చేయవచ్చు. ఫిర్యాదు ధనపరంగా చిన్న మొత్తానికో లేదా అంశానికో కావచ్చు. అయినా సమాజంపై దాని ప్రభావం అసమానం కావచ్చు. అలాగే పర్యావరణానికి హాని కలగకుండా ఉండే వస్తువులను సేవలను పొందటం వినియోగదారుల హక్కు. దీనిపై ప్రశ్నించడానికి సర్వ హక్కులు కల్పించారు.

ఈ చివరి రెండు హక్కులు మన దేశంలో అమలు కావడం లేదు

వినియోగదారుల రక్షణ చట్టం : వినియోగించుకునే వారికి కొన్ని హక్కులున్నాయి. ఈ హక్కుల పరిరక్షణకు నిబంధనలు, చట్టాలున్నాయి. వివాదం ఏర్పడితే పరిష్కరించడానికి ప్రత్యేకంగా వినియోగదారుల కమిషన్లు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉన్నాయి. కనుక ప్రతీ వినియోగదారుడు తన హక్కులకు నష్టం కలిగినప్పుడు, తాను మోసపోయినప్పుడు చట్టం పరిధిలో పోరాడేందుకు తగిన వ్యవస్థలు అందుబాటులో ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం 1986లో వినియోగదారుల రక్షణకు విప్లవాత్మకమైన చట్టాన్ని తీసుకువచ్చింది. అదే వినియోగదారుల హక్కుల రక్షణ చట్టం. ఈ చట్టాన్ని అమలు చేయడానికి ప్రతీ జిల్లా కేంద్రంలో వినియోగదారుల ఫోరాలను జిల్లా, రాష్ట్ర, కేంద్ర స్థాయిలో ఏర్పాటు చేశారు. జిల్లా స్థాయి ఫోరానికి రిటైర్డ్ జిల్లా జడ్జి అధ్యక్షుడిగా, మరో ఇద్దరు సభ్యులుగా ఉంటారు. మెజారిటీ సభ్యుల ఆమోదంతో ఫోరంలోని కేసులపై తీర్పులు ఇస్తారు. వస్తువు లేదా సేవ విలువ, కోరే నష్ట పరిహారం, రూ.లక్ష వరకు అయితే కోర్టు ఫీజు రూ.100, రూ.లక్ష నుంచి రూ.5లక్షల వరకు రూ.200, రూ.10లక్షల వరకు రూ.400, రూ.10లక్షలు ఆపైన అయితే రూ.500 నామమాత్రపు కోర్టు ఫీజు మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. కొనే వస్తువు, పొందే సేవలు వినియోగదారుల రక్షణ అవసరాలు తీర్చడమే కాకుండా అవి సుదీర్ఘ కాలం మన్నేలా ఉండాలి. అవి వినియోగదారుల జీవితాలకు, ఆస్తులకు నష్టం కలిగించే విధంగా ఉండకూడదు. ఈ భద్రత పొందటానికి వినియోగదారులు కొనే వస్తువుల నాణ్యతను నిర్ధారించుకోవలసి ఉంటుంది. వీలైనంత వరకు ఐఎస్ఐ, అగ్‌మార్క్, హాల్ మార్క్ వంటి నాణ్యతా చిహ్నాలు గల వస్తువులనే కొనుగోలు చేయాలి.



ఫిర్యాదు ఎలా చేయాలి?

ఫిర్యాదు చేసే విధానం చాలా సులభం. అలాగే దానిపై స్పందన కూడా త్వరగా ఉంటుంది. తెల్లకాగితంపై ఫిర్యాదు వివరాలు రాసి పంపవచ్చు. న్యాయవాది అవసరం లేదు. ఫిర్యాదుదారుడైనా, అతని ఏజెంట్ అయినా ఫోరంలో స్వయంగా ఫిర్యాదు ఇవ్వవచ్చు. అలా వీలుకాకపోతే పోస్టు ద్వారా కూడా పంపవచ్చు. ఫిర్యాదారు పూర్తి పేరు, చిరునామా, ఇతర వివరాలు ఎవైనా ఉంటే ఇవ్వాలి. అవతలి పార్టీ పూర్తి పేరు, చిరునామా, ఫిర్యాదు చేయడానికి గల కారణాలు, ఏ విధంగా నష్టపోయారనే విషయాలు తెలుపుతూ డాక్యుమెంట్లు, రసీదులు, ఇతర వివరాలు ఏవైనా ఉంటే ఫిర్యాదుకు జతచేయాలి. ఫిర్యాదుదారుడు ఏ విధంగా నష్ట పరిహారం అడుగుతున్నాడో వివరణ ఇవ్వాలి.


హక్కుల రక్షణకు కమిటీలు ఏర్పాటు చేయాలి



ప్రపంచ వినియోగదారుల దినోత్సవానికి సంబంధించి ఈ సంవత్సరం థీమ్ సుస్థిరమైన జీవనశైలికి ఒక సరళమైన పరివర్తన. ఈ థీమ్ అమలులోకి రావాలంటే ఆరోగ్యకరమైన వస్తు వినియోగం తప్పనిసరి. ఈ క్రమంలోనే ఆర్థిక, పర్యావరణ రీత్యా సుస్థిరమైన జీవనశైలి సాధ్యమవుతుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో గ్రామీణ వినియోగదారులు 67 శాతం ఉన్నారు. వినియోగదారుల హక్కుల రక్షణకు రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో ఆహార సలహా సంఘాలను, వినియోగదారుల హక్కుల రక్షణ కమిటీలను, ఆహార భద్రతా కమిటీలను ఏర్పాటు చేయాలి.

- సాంబరాజు చక్రపాణి, వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి

చైతన్యంతులైతేనే అక్రమాలు అరికట్టవచ్చు



ప్రభుత్వం ఎన్ని చట్టాలు చేసినా వినియోగదారులు చైతన్యవంతులు అయితేనే అక్రమాలను అరికట్టవచ్చు. వినియోగదారులు ప్రశ్నించేతత్వాన్ని అలవాటు చేసుకోవాలి. ఏ వస్తువు కొనుగోలు చేసినా ఒరిజినల్ బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి. ఉత్పత్తిదారుడు ఇచ్చే వారంటీ, గ్యారంటీ కార్డులను జాగ్రత్తగా భద్రపర్చుకోవాలి. వస్తువులో నాణ్యతా లోపం ఉన్నప్పుడు వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌లో ఫిర్యాదు చేసి న్యాయం పొందాలి. ఆఫ్‌లైన్ లేదా ఆన్‌లైన్ లావాదేవీలు, ఎలక్ట్రానిక్, టెలీషాపింగ్, మార్కెటింగ్ ద్వారా జరిగే మోసాలకు కూడా చట్టం వర్తిస్తుంది.

- డాక్టర్ పల్లెపాడు దామోదర్, దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడు

భద్రత హక్కు: వినియోగదారులు తమ ప్రాణాలకు, ఆస్తికి హాని కలిగించే వస్తువులు, సేవల నుంచి రక్షణ పొందడానికి హక్కు కలిగి ఉన్నాడు.

సమాచార హక్కు: వస్తువుల నాణ్యత, పరిణామం, శక్తి, స్వచ్ఛత, ప్రమాణం, ధర గురించి తెలుసుకునే హక్కు. వస్తు వుల ప్యాకింగ్‌పై దానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఉత్పత్తిదారుడు విధిగా ముద్రించాలి. వస్తువు ఎప్పుడు? ఎక్కడ ? ఎలా? తయారైంది. వస్తువు తయారీకి వాడిన పదార్థాలు, ఎక్స్‌పయరీ తేదీ తదితర సమాచారాన్ని ముద్రించకపోతే తయారీదారున్ని, విక్రయదారున్ని నిలదీసే హక్కు వినియోగదారుడికి ఉంది.

వినియోగదారుల విద్య: వినియోగదారులు తమ హక్కులను తెలుసుకునే, నైపుణ్యాలను పెంపొందించుకునే క్రమంలో అందుకు సంబంధించిన సమాచారం, విద్యను పొందే హక్కు కలిగి ఉన్నాడు. అవాంఛిత వ్యాపార కార్యకలాపాల నుంచి రక్షణ పొందేందుకు వస్తు నాణ్యత, బరువు, స్వచ్ఛత, పుష్టి, ప్రమాణం గురించి తెలుసుకునేందుకు అవసరమైన జ్ఞానాన్ని పొందే హక్కు వినియోగదారుడికి ఉంది.

కనీస అవసరాల హక్కు : వినియోగదారుడి హక్కుల్లో ఇది కీలకమైంది. తాను, తన కుటుంబం జీవించడానికి కనీస అవసరాలను కల్పించే బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ప్రభుత్వాలకు పన్నులు చెల్లించే పౌరుడిగా తన కనీస అవసరాలను తీర్చని ప్రభుత్వాన్ని నిలదీయవచ్చు.

సరైన వాతావరణంలో జీవించే హక్కు : ప్రజలు వినియోగదారుడు ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవించాలని కోరుకుంటాడు. కాలుష్య రహితమైన, ప్రమాద రహితమైన, స్వేచ్ఛాయుతమైన వాతావరణం కల్పించే బాధ్యత ప్రభుత్వానిది. ఈ విషయంలో విఫలమైతే బాధ్యులను నిలదీసే హక్కు వినియోగదారుడికి ఉంది.



హసన్‌పర్తి పెద్ద రథచక్రాల బండి తాడు లాగి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు

వెంకన్న పెళ్లికొడుకాయెనే..

- కన్నుల పండువగా వెంకటేశ్వరస్వామి కల్యాణం
- వైభవంగా ప్రారంభమైన ఎర్రగట్టు జాతర

హసన్‌పర్తి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఎర్రగట్టు వెంకన్న పెళ్లి కన్నులపండువగా జరిగింది. హసన్‌పర్తి మండలం అంబాల రోడ్డులోని ఎర్రగట్టు జాతర శుక్రవారం వైభవంగా ప్రారంభమైంది. హసన్‌పర్తి నుంచి పెద్ద రథచక్రాల బండి, భీమారం నుంచి చిన్న రథచక్రాల బండి మీద శ్రీ అలివేలు మంగమ్మ పద్మావతి సమేత శ్రీనివాసుడి ఉత్సవమూర్తుల ప్రతిమలు రాత్రి గుట్టకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ఇరుగ్రామాల రథచక్రాల బండ్లను తాడు లాగి ప్రారంభించారు. ఉత్సవమూర్తులను ఆయా గ్రామాల పురవీధుల నుంచి డప్పుచప్పుళ్లతో మంగళవాయిద్యాలతో డీజే సౌండ్ సిస్టంతో ఎర్రగట్టుగుట్టకు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు ఉత్సవమూర్తుల ప్రతిమలకు మంగళహారతులతో స్వాగతం పలికారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం

ఎర్రగట్టుగుట్ట విశ్వక్‌సేనా సేవా సమితి కల్యాణ మండపంలో హసన్‌పర్తి - భీమారం ఉత్సవమూర్తుల ప్రతిమలకు స్వస్తి క్రోధినామ సంవత్సరం ఉత్తర ఫాల్గుణి నక్షత్రం శుక్ల పౌర్ణమి శుక్రవారం రాత్రి 11-48 గంటలకు హస్త నక్షత్రయుక్త వృశ్చిక లగ్న పుష్కరాంశ సుముహూర్తమున కల్యాణం జరిపించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో వెంకట్రావ్‌తో పాటు 14 మంది ధర్మకర్తలు శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు వేదాంతం పార్థసారథాచార్యులు, ఆరుట్ల శ్రీధరాచార్యులు వేదమంత్రోచ్చరణలతో స్వామివారికి కల్యాణం జరిపించడంతో శుక్రవారం నుంచి మంగళవారం వరకు ఐదురోజుల పాటు జరిగే శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమైనట్లు ఆలయ నిర్వాహణ కమిటీ ప్రకటించింది. ఈ కార్యక్రమంలో ఎర్రగట్టు జాతర ఉత్సవకమిటీ ధర్మకర్తలు ఆరెల్లి వెంకటస్వామి, శీలం రమేష్, కనపర్తి రాజు, పోలరాజు శ్యామల, చింతల రమేష్, బిగుళ్ల సురేష్, మానుపాటి విజెందర్, శాగంటి సదానందం, తోట శ్రీనివాస్, కొండమీది సంతోష్, అటికం శ్రీనాథ్‌గౌడ్, సంగాల ప్రశాంత్‌కుమార్‌తో పాటు కార్పొరేటర్లు గురుమూర్తి శివకుమార్, జక్కుల రజితవెంకటేశ్వర్లుయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

పట్టు వస్త్రాలు, తలంబ్రాలు

యేటా శ్రీవెంకటేశ్వరస్వామి కల్యాణానికి పట్టు వస్త్రాలు తలంబ్రాలు సమర్పించే చింతగట్టు వాసి, మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ, సీనియర్ ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి ఈ యేడు కూడా స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ ఈవో వెంకట్రావ్ ఆధ్వర్యంలో శుక్రవారం కుటుంబసభ్యులతో కలిసి నరహరి స్వామివారికి తీసుకువచ్చిన పట్టువస్త్రాలు, తలంబ్రాలను అందించారు. అనంతరం నరహరి స్వామివారి స్వాగత తోరణాన్ని తన సొంత ఖర్చుతో నిర్మిస్తానని హామీ ఇచ్చారు.



స్వామివారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పిస్తున్న మధ్యప్రదేశ్ సీనియర్ ఐఏఎస్ అధికారి నరహరి

నమో.. నారసింహా..

- వైభవంగా సాగుతున్న కొమ్మాల జాతర
- పోటెత్తిన భక్తులు.. పెద్దఎత్తున మొక్కులు
- పోటాపోటీగా రాజకీయ ప్రభ బండ్లు



కొమ్మాల జాతరలో వెలసిన గుడారాలు



ఉత్సవ మూర్తులను గరుడ వాహనంపై ఊరేగిస్తున్న భక్తులు

గీసుగొండ, మారి 14 ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిగాంచిన కొమ్మాల లక్ష్మీనరసింహస్వామి జాతర అంగరంగ వైభవంగా జరిగింది. శుక్రవారం భక్తులు పెద్దఎత్తున పోటెత్తారు. ఉదయం హోలీ జరుపుకున్న అనంతరం సాయంత్రం స్వామివారి దర్శించుకునేందుకు భక్తులు ఎడ్లబండ్లు, వివిధ వాహనాల్లో జాతరకు తరలివచ్చారు. నిండు పౌర్ణమిన ఉప్పొంగిన భక్తితో భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావటంతో ఒక్కసారిగా జాతర జనసంద్రంగా మారింది. కొమ్మాల నరసింహుడిని (ఉత్సవమూర్తులు) చూసి తరించి మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ వాహనాలు, ఎడ్లబండ్లపై ఒంటె, ఏనుగు, గుర్రం, మేక వంటి ప్రభలను అందంగా ముస్తాబు చేసుకొని కోలాటం, నృత్యంతో కోలాహలంగా వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయం గుట్ట చుట్టూ ఎడ్లబండ్లు తిరిగే ఘట్టం వైభవంగా జరిగింది. ఎడ్ల బండ్లు తిరిగే సమయంలో భక్తులు చేసిన గోవింద నామస్మరణ మిన్నంటింది. గీసుగొండ, దుగ్గొండి, నల్లబెల్లి, నర్సంపేట, సంగెం, చెన్నారావుపేట మండలాల్లోని గ్రామాలతో పాటు గ్రేటర్ వరంగల్ నుంచి పెద్ద సంఖ్యలో ఎడ్లబండ్లపై తరలివచ్చారు. వరంగల్- నర్సంపేట, కొమ్మాలకు వచ్చే రోడ్లు ఎడ్లబండ్లు, వాహనాలతో రద్దీగా మారాయి. ఆలయ ప్రధాన ప్రవేశ ద్వారం నుంచి ఆలయం వరకు భక్తుల రద్దీ పెరగడంతో భక్తులకు ఎటువంటి ఆటంకం కలుగకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. దైవదర్శనం కోసం భక్తులు క్యూలో బారులు తీరారు. ప్రత్యేక, శీఘ్ర దర్శనాల ద్వారా భక్తులు దైవదర్శనం చేసుకున్నారు.

గరుడ వాహనంపై స్వామివారి ఊరేగింపు

బ్రహ్మోత్సవాల్లో ప్రభబండ్లు తిరగడానికి ముందు ఉత్సవమూర్తులను గరుడ వాహనంపై ఊరేగించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు, ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు, ఉత్సవ కమిటీ చైర్మన్ కడారి రాజు, అర్చకులు రామాచార్యులు, విష్ణు, ఫణీంద్రచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

హోరెత్తిన రాజకీయ ప్రభల జోరు

కాంగ్రెస్‌లో రెండు వర్గాలుగా ఏర్పడి భారీ ఎత్తులో రాజకీయ ప్రభలను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే రేవూరి, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీ వర్గాలుగా ఏర్పడిన నాయకులు ప్రభలను పోటీపడి నిర్మించారు. ఆలయం గుట్ట చుట్టూ ప్రభబండిని తిప్పేందుకు మొదట రేవూరి వర్గానికి, తరువాత కొండా వర్గానికి అనంతరం బీఆర్ఎస్, ఇతర పార్టీల ప్రభబండ్లను అనుమతిచ్చారు. కాగా, తొలుత పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ప్రభ బండిని కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, నాయకులు దొమ్మాటి సాంబయ్య, గన్నోజు శ్రీనివాసచారి, చాడా కొమురారెడ్డి, శ్రీనివాస్, సౌజన్య పాల్గొన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి బీఆర్ఎస్ ప్రభ బండిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో కొమ్మాల జాతర ప్రశాంతంగా జరిగేదని, కాంగ్రెస్ ప్రభుత్వంలో వర్గపోరు సాగుతోందన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభ బండిని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కాళీప్రసాద్ ప్రారంభించారు. చివరగా అల్లం బాలకిశోర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభబండిని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రడం భరత్, వీరగోని రాజ్‌కుమార్‌లు పాల్గొన్నారు. కొమ్మాల బస్టాప్ వద్ద ఏర్పాటు చేసిన ప్రభల వద్ద ఆయా వర్గాల, పార్టీల నాయకులు పెద్ద సంఖ్యలో చేరడంతో సందడిగా మారింది. పార్టీ ప్రభల ముందు అభిమానులు బాణసంచా కాల్చి, కోలాటం ఆడి, నృత్యం చేశారు. ఈ సందర్భంగా వరంగల్- నర్సంపేట మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సుమారు 3గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది. ట్రాఫిక్‌లో ఓ అంబులెన్స్ ఇరుక్కుపోయింది.



ప్రభ బండి నుండి అభివాదం చేస్తున్న కొండా మురళి



ప్రభ బండిపై ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



బీఆర్ఎస్ ప్రభ బండిపై మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి

భారీ పోలీస్ బందోబస్తు

కొమ్మాల జాతరలో అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. డీసీపీ అంకిత్‌కుమార్, ఏసీపీ తిరుపతి, సీఐ మహేందర్ ప్రత్యేకంగా పర్యవేక్షించారు. 500మంది పోలీసులతో బందోబస్తును నిర్వహించారు. రాజకీయ ప్రభల ముందు డీజేలను పోలీసులు నిషేధించినా డీజేలు జోరు ఆగలేదు. కాగా సాయంత్రం 4 గంటలకు కోనాయిమాకుల వైన్‌షాపు ఎదుట కొంతమంది యువకులు భారీ సంఖ్యలో చేరి ఘర్షణ పడి కర్రలతో కొట్టుకున్నారు. వెంటనే పోలీసులు అక్కడికి వెళ్లడంతో యువకులు పారిపోయారు.

వంద పడకల ఆస్పత్రికి అడుగులు

రూ.45.50కోట్లతో స్టేషన్‌ఘన్‌పూర్‌లో నిర్మాణం

రేపు ఆస్పత్రి నిర్మాణానికి సీఎం శంకుస్థాపన

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రి అప్‌గ్రేడ్‌తో నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందనున్నాయి. ఎమ్మెల్యే కడియం శ్రీహరి వంద పడకల ఏరియా ఆస్పత్రిని ప్రభుత్వం నుంచి మంజూరు చేయించారు. ఈ ఆస్పత్రి కోసం తొలుత బస్సు డిపోకు కేటాయించిన 4ఎకరాల స్థలాన్ని చూశారు. ఆర్టీసీ అధికారులను ఎమ్మెల్యే కడియం ఒప్పించి స్థలాన్ని ఆస్పత్రి నిర్మాణానికి బదిలీ చేయించారు. అనంతరం ఆస్పత్రి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయించి ప్రభుత్వానికి నివేదించడంతో గత జనవరి 20న రూ45.50 కోట్లతో వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి ప్రభుత్వం జీవోను జారీ చేసింది.



వంద పడకల ఆస్పత్రి నమూనా భవనం

ఆస్పత్రి ఏర్పాటుతో ప్రయోజనాలు

వంద పడకల ఆస్పత్రి ఏర్పాటుతో డివిజన్ ప్రజలకు అనేక సేవలు అందుబాటులోకి రానున్నాయి. వివిధ విభాగలకు చెందిన వైద్యుల సేవలు వినియోగంలోకి రానున్నాయి.

గైనిక్, ఫిజీషియన్, సర్జన్, ఆర్థోపెడిక్, పిడియాట్రిషన్, ఫిజియోథెరపీ, న్యూరో, డెంటల్, అనస్థీషియా వైద్యుల సేవలు అందుబాటులోకి రానున్నాయి. ప్రతీ విభాగంలో వైద్యుల సంఖ్య నలుగురు నుంచి ఐదుగురు ఉంటారు. అత్యవసర సేవల విభాగం అందుబాటులోకి వస్తుంది. జాతీయ రహదారి పైన రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు సమీపంలో ఆస్పత్రి ఉండడంతో అనేక మంది ప్రాణాలను బతికించుకునే అవకాశం ఉంటుంది. ఆస్పత్రిలో ఏర్పాటుతో ట్రామాకేర్ సెంటర్, బ్లడ్ బ్యాంకు ఏర్పాటు, 24గంటల పాటు వైద్య సేవలు, అంబులెన్స్ సేవలు, ఆపరేషన్ థియేటర్స్ పోస్టుమార్టం సేవలు, ఎస్ఎన్‌సీయూ సేవలు అందుబాటులోకి వస్తాయి.

జిల్లాలో అంబరాన్నంటిన హోలీ సంబరాలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు మండలాల్లోని గ్రామాలు,కాలనీలో హోలీ వేడుకలు అంబరాన్నంటాయి. జిల్లాలోని పోలీస్ అధికారులు ఉదయం 10 గంటలకు ఎస్పీ క్యాంపు కార్యాల యానికి చేరుకున్నారు. జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్‌కు జిల్లాలో ని డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్‌కు రంగులు పూసి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీ పోలీస్ అధికారులకు రంగులు అద్ది హోలీ శుభాకాంక్షలు తెలిపా రు. ఎస్పీ క్యాంపు కార్యాలయంలో నిర్వహి ంచిన హోలీ వేడుకల్లో ఎస్పీ సుధీర్‌రా ంనాథ్ కేకన్ కుమారుడుని భుజాలపై కూర్చోపెట్టుకొని డ్యాన్స్ వేస్తుండ గా పోలీస్ అధికారులు సైతం డీజే సౌండ్ పాటలకు నృత్యాలు చేస్తూ ఆనందోత్సవాల నడుమ వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ సుధీర్‌రాం నాథ్‌కేకన్ మాట్లాడుతూ.. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక హోలీ అని, ఆనందోత్సవాల నడుమ హోలీ వేడుకలు జరుపుకోవాలని సూచించారు. ఈ వేడుకల్లో డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో...

● మహబూబాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్‌కు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు హోలీ శుభాకాంక్షలు తెలిపారు.

● జిల్లా కేంద్రంలో ఉషోదయ వాకర్స్ ఆధ్వర్య ంలో హోలీ వేడుకలను ఆనందోత్సవాల నడుమ జరుపుకున్నారు. అనంతరం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తూ ప్రధాన కూడళ్లలో ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ దేవిరెడ్డి, అసోసియేషన్ బాధ్యులు పాలబిందెల మల్లయ్య, ఆకుల శంభయ్య, తండ సదానందం, నల్లు సుధాకర్ రెడ్డి, బొడ్డుపెల్లి ఉపేంద్రం, కళ్లెం వెంకట్‌రెడ్డి, దాసరి ప్రసాద్, సాదు మహిపాల్‌రెడ్డి, కాపరబో యిన శ్రీనివాస్, పమ్మి రాజు, యిమ్మడి కృష్ణమూర్తి, కన్నా అశోక్‌బాబు, సుంకరి పరందామయ్య, నాళ్ల నరసింహ రావు, సుంకరి వెంకటేశ్వర్లు, కోట కనకయ్య, కామ సంజీవరావు, లక్ష్మయ్య, వేణు కుమార్ పాల్గొన్నారు.

● జిల్లా కేంద్రంలోని సెవెన్ హిల్స్‌లో నిర్వహించిన హోలీ వేడుకల్లో సెవెన్ హిల్స్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షులు కోటా సంజీవరెడ్డి, ప్రధానకార్యదర్శి బండారు వెంకటరమణ, సొసైటీ బాధ్యులు ఉప్పల శ్రీనివాసులు, తల్లాడ శ్రీనివాస్, వేముల రవికుమార్, బ్రాహ్మణపల్లి సువర్ణ, తోట శిరీష, రచ్చ సుజాత, శ్రీరాం ప్రియాంక, పద్మచ శ్రీలత, ఉష రజిత తదితరులు పాల్గొన్నారు.

● మానుకోట కరాటే అకాడమీ చైర్మన్ వీరునాయక్ ఆధ్వర్యంలో చిన్నారులు ఒకరికొకరు రంగులు పులుముకొని హోలీ వేడుకలను ఘనం గా జరుపుకున్నారు. కేరింతలు కొట్టారు.

● మహబూబాబాద్‌లో బీజేపీ నాయకులు హోలీ వేడుకల్లో పాల్గొని రంగులు పులుముకున్నారు. ఈ వేడుకలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యాప సీతయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు క్యాచువల్ శ్యాంసుందర్‌శర్మ, మోసంగి మురళి, గడ్డం అశోక్, దార ఇందుభారతి, మహేష్, అనిల్, ప్రశాంత్, రాజు పాల్గొన్నారు.

● మహబూబాబాద్ సబ్ జైలులో నిర్వహించిన హోలీ వేడుకల్లో జైలు సూపరిండెంట్ మల్లెల శ్రీనివాసరావు, సిటిజన్ ఫోరం జిల్లా కోఆర్డినేటర్ శంతన్‌రామరాజు, సిబ్బంది ప్రసాద్, చీర వెంకన్న, జితేంద్రప్రసాద్, జైపాల్‌రెడ్డి, విజయ్, మురళి, జనార్దన్ పాల్గొన్నారు.

వివిధ మండలాల్లో...

చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లిలో మాజీ ఎమ్మెల్యే డి.ఎస్ రెడ్యానాయక్ హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ జిల్లా నాయకులు అయుబ్‌పాషా, యువకులు పాల్గొన్నారు.

● మరిపెడ మునిసిపల్ కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో హోలీ వేడుకలను జరుపుకున్నారు. మునిసిపల్ కేంద్రంలో మాజీ మునిసిపల్ చైర్‌పర్సన్ సింధూరకుమారి-రవినాయక్ దంపతులు, బీజురాజుపల్లిలో గుడిపుడి నవీన్‌రావు-మంజుల దంపతులు పాల్గొన్నారు.

● దంతాలపల్లి మండల కేంద్రంతో పాటు దాట్ల, పెద్దముప్పారం గ్రామాల్లో హోలీ వేడుకలను నిర్వహి ంచగా నాయకులు పొన్నూటి బాలాజీ, కొమ్మినేని రవీందర్, మహేష్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

● నర్సింహులపేట మండల కేంద్రంతో పాటు బొజ్జన్నపేట, జయపురం, పెద్దనాగారం, కొమ్ముల వంచ గ్రామాల్లో హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో యువకులు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

● పెద్దవంగర మండలంలోని అన్ని గ్రామాల్లో హోలీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

● గార్ల మండల వ్యాప్తంగా హోలీ వేడుకలు యువతీ, యువకులు జరుపుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో గార్ల మాజీ అజ్మీరా భస్సీలాల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాళ్లపల్లి కృష్ణగౌడ్, కమల్ కుమార్ అగర్వాల్, జితేందర్‌కుమార్ అగర్వాల్, మాచర్ల సుందర్, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

● బయ్యారం మండల కేంద్రంతో పాలు అన్ని యువతీ, యువకులు హోఎలీ వేడుకలు జరుపుకున్నారు. తొర్రూరు పట్టణ కేంద్రంలో హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

● కురవి మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో యువతీ, యవకులు హోలీ వేడుకల్లో పాల్గొన్ని ఆనందోత్సవాల నడుమ రంగులు పులుముకున్నారు. కేరింతలు కొట్టారు.

● సీరోలు మండల కేంద్రంతో పాటు కాంపల్లి, చింతపల్లి, మన్నెగూడెం, కొత్తూరు (సి), తాళ్లసంకీస, ఉప్పరగూడెం, చిలుకోయలపాడు గ్రామాల్లో యువతీ, యువకులు ఒకరికొకరు రంగులు పులుముకుంటూ ఆనందోత్సవాల నడుమ వేడుకలు జరుపుకున్నారు. కేరింతలు కొట్టారు.

● నెల్లికుదురు మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో హోలీ వేడకలు నిర్వహించారు. ఆయా వేడుకల్లో ఎస్సై చిర్ర రమేష్‌బాబు, ఆర్య వైశ్య సంఘం నాయకులు వేముల బాబ్జీ, వెన్నాకుల శ్రీనివాస్, ఉపేందర్, బచ్చు నాగన్న, అనిల్, విజయ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● డోర్నకల్ మండల వ్యాప్తంగా యువతీ, యువకులు, చిన్నారులు హోలీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

● గూడూరు మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో హోలీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఒకరికొకరు రంగులు పూసుకున్నారు.

● కేసముద్రం మండల కేంద్రంలో ప్రముఖులు డీజే సౌండ్ సిస్టం పాటలకు నృత్యాలు చేస్తూ ఆనందోత్సవాల నడుమ హోలీ వేడుకలను జరుపుకున్నారు. మండలంలో పాటు పలు గ్రామాల్లో హోలీ సంబురాలు అంబరాన్నంటాయి. తాళ్లపూసపల్లిలో యువత హోలీ సంబరాల్లో మునిగి తేలారు.



హోలీ వేడుకల్లో పాల్గొన్న మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న



మహబూబాబాద్‌లో హోలీ ఆడుతున్న యువకులు



చిన్నగూడూరు మండలం ఉగ్గంపలి హోలీ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్



కురవిలో హోలీ ఆడుతున్న యువకులు



తొర్రూరు వీరప్పనగర్ హోలీ వేడుకల్లో కాలనీవాసులు



మరిపెడ మండలం అబ్బాయిపాలెంలో..



హోలీ వేడుకల్లో బైక్ ర్యాలీలో పాల్గొన్న ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ బాధ్యులు



నెల్లికుదురు అంబేద్కర్ సెంటర్‌లో హోలీ వేడుకల్లో పాల్గొన్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

వైభవంగా మల్లికార్జునస్వామి కల్యాణం



ఉల్లెపల్లి మల్లికార్జునస్వామి కల్యాణం జరిపిస్తున్న అచ్యుత్‌రావు-సునీత దంపతులు

మరిపెడ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : వైభవంగా ఉల్లెపల్లి మల్లికార్జునస్వామి కల్యాణం శుక్రవారం వైభవంగా జరిగింది. ఎల్లారిగూడెం గ్రామస్థుడు అచ్యుత్‌రావు-సునీత దంపతులు ఈ వేడుకలో పెళ్లి పెద్దలుగా పీటలపై కూర్చున్నారు. వేద పండితులు రఘురామ్‌శర్మ నేతృత్వంలో చిట్ట శ్రీకాంత్, శ్రవణ్, ప్రసాద్, భరత్, శేఖర్, పణి తదితరులు కల్యాణాన్ని ఘనంగా జరిపించారు. ఈ కార్యక్రమంలో నర్సింహారావు, గోపాల్‌రావు, భూక్యాతండా గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం



ఇనుగుర్తి లక్ష్మీనర్సింహాస్వామి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న ప్రభబండ్లు

ఇనుగుర్తి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) :ఇనుగుర్తి లక్ష్మీనర్సింహాస్వామి దేవాలయంలో శుక్రవారం కల్యాణోత్స వాల్లో భాగంగా స్వామివారి కల్యాణం అర్చకులు తిరునహరి కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఉత్సవవిగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. ప్రభబండ్లతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలు రాత్రి ముగిశాయి. గ్రామస్తులు ఉత్సవాలకు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

శ్రీ వేంకటేశ్వరస్వామికి అష్టోత్తర శతకలశాలతో అభిషేకం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ మునిసిపాలిటీ పరిధిలోని స్వయంభూ శ్రీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగవ రోజు శుక్రవారం ఆలయ ప్రధాన అర్చకులు గొడవర్తి చక్రధరాచార్యుల వేదమంత్రోచ్చరణల నడుమ అష్టోత్తర శత కలషములతో అభిషేకం నిర్వహించారు. అనంతరం సుప్రభాతసేవ, సేవాకాలం, నివేదన విన్నపం, తీర్థప్రసాదగోష్టి, ద్వారతోరణ ధ్వజకుంభారాధన, చతుస్థానార్చన, నిత్యహవనం, శ్రీలక్ష్మీనారాయణిఇష్టి, నిత్యపూర్ణాహుతి, బలిహరణ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయిని ప్రభాకర్‌రెడ్డి, కాలె కాశీనాథ్ దంపతులు, అర్చకులు గొడవర్తి శ్రీనివాస చార్యులు, అనిరుద్ ఆచార్యులు, విశ్వం, చరణ్, మిట్టపల్లి విజయ్, గౌతమ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు స్వామి వారి కల్యాణం..

అనంతాద్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 5వ రోజు ఉదయం 6 గంటలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి ఉదయం 10 గంటలకు శ్రీ పద్మావతి గోదాసమేత శ్రీ వెంకటేశ్వరస్వామి కల్యాణమహోత్సవం జరిపిస్తారు. సాయంత్రం గరుడవాహనసేవ, తెప్పోత్సవం నిర్వహించనున్నారు.



అనంతాద్రి శ్రీ వేంకటేశ్వరస్వామి స్వామి దేవాలయంలో స్వామి వారికి అష్టోత్తర శత కలశాలతో అభిషేకం చేస్తున్న అర్చకులు

అనాథ వృద్ధురాలికి సీఐ అంత్యక్రియలు



అంత్యక్రియల్లో పాడె మోస్తున్న సీఐ దేవేందర్

నెల్లికుదురు మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలేరు గ్రామంలో అనాధ వృద్ధురాలు చీకటి ఉపేంద్ర (65) శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందడంతో మహబూబాబాద్ సీఐ పెండ్యాల దేవేందర్ సొంత ఖర్చులతో దహన సంస్కారాలు నిర్వహించి మానవత్వం చాటుకున్నాడు. చీకటి ఉపేంద్రకు తన భర్త చీకటి వీరయ్య 15 ఏళ్ల క్రింతం మృతి చెందాడు. కుమారులు, కుమార్తెలు లేకపోవడంతో తోడు నీడ లేక అనాథగా మిగిలింది. సీఐ దేవేందర్ 2018 లో నెల్లికుదురు పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వర్తించేటప్పుడు ఆమె ఒంటరి జీవనం గడుపుతుండగా గ్రామస్థులు సీఐ దేవేందర్ దృష్టికి తీసుకరాగా స్పందించి సొంత ఖర్చులతో రేకుల ఇల్లు నిర్మించి ఔదార్యం చాటుకున్నాడు. అప్పటినుంచి ప్రభుత్వం అందించే వృద్ధాప్య పింఛన్‌తో జీవనం కొనసాగిస్తూ మృతిచెందింది. ఉపేంద్ర మృతిచెందిందని సీఐ దేవేందర్‌కు గ్రామస్థులు సమాచారం అందించడంతో ఆలేరుకు చేరుకుని గ్రామస్థుల సహకారంతో అంత్యక్రియలు నిర్వహించాడు. కన్న కొడుకులే తల్లిదండ్రులు పట్టించుకోని ఈ రోజుల్లో సీఐ దేవేందర్ వృద్ధురాలుకు ఇల్లు నిర్మించి దహన సంస్కారాలు నిర్వహించడంతో గ్రామస్థులు కంటతడి పెట్టుకున్నారు.

ఆదికవి పాల్కూరికి సోమనాథుడు



సోమ నాథుడు విగ్రహానికి మాల వేస్తున్న ఝాన్సీరెడ్డి

పాలకుర్తి, మార్చి 14(ఆంధ్రజ్యోతి) : పాల్కూరికి సోమనాథుడు ఆదికవి అని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పాల్కూరికి సోమనాధుడు దీపారాధన కార్యక్రమంలో భాగంగా ఆయన విగ్రహానికి ఝాన్సీరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో సోమనాథుడని ఆదర్శంగా తీసుకొని కవులు, రచయితలుగా ఎదిగారని అన్నారు. ఈ ప్రాంతంలో జన్మించిన ప్రతి ఒక్కరు అదృష్టవంతులని అన్నారు. సోమనాథుడు ఇంటిపేరే క్రమ క్రమంగా పాలకుర్తిగా మారిందని అన్నారు. చారిత్రక ప్రాంతంగా విరాజిల్లుతున్న ఈ నేలను అన్ని విధాలు అభివృద్ధి చేసేలా కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టు మార్గం లక్ష్మీనారాయణ, దేవస్థానం సూపరిండెంట్ వెంకటయ్య, పూజారి దేవగిరి అనిల్ శర్మ, గూడూర లెనిన్ తదితరులు ఉన్నారు.

చికిత్సపొందుతూ యువకుడి మృతి



సురేష్ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్,మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : చికిత్స పొందుతూ.. యువకుడు మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ మండలం ఉత్తరతండా శివారు రాయికుంటతండాలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయికుంటతండాకు చెందిన బానోత్ సురేష్ (27) కూలీ... పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఫిబ్రవరి 2న తన కుమారుడికి ఆరోగ్యం బాగోలేకపోవడంతో రాయికుంట తండా నుంచి మహబూబాబాద్‌కు తన ద్విచక్రవాహనంపై భార్య భూమిక, కుమారుడిని తీసుకుని వస్తున్నాడు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట శివారు జీడీతండాకు చెందిన కారులో వచ్చిన వీరు అనే వ్యక్తి మహబూబాబాద్‌లో పనులు ముగించుకుని తిరిగి వెళ్తున్న క్రమంలో సరిగ్గా ఈదులపూసపల్లికి చేరుకోగానే ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టారు. ఈ ఘటనలో సురేష్ తీవ్రగాయాలు కాగా, అతని భార్య భూమికకు కాలు విరిగింది. ఇది గమనించిన స్థానికులు వారిని చికిత్స నిమిత్తం 108 ద్వారా జిల్లా ఆస్పత్రికి తరలించారు. సురేష్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మూడురోజుల క్రితం స్వగ్రామానికి సురేష్‌ను తీసుకురాగా శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతునికి భార్య భూమిక, కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై మృతుడి భార్య భూమిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై దీపికరెడ్డి తెలిపారు.

మోటార్ పగులగొట్టి.. రాగి తీగ చోరీ



ఉగ్గంపల్లిలో కాపర్ తీసుకెళ్లి మోటారు విడిభాగాలు పక్కన పడవేసిన దృశ్యం

చిన్నగూడూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : యాసంగి పం టకు సాగునీరందక రైతులు అల్లాడుతుంటే మరో చిక్కు వచ్చి పడింది. వరుసగా వ్యవసాయ మోటార్లు పగలగొట్టి అందులోని కాపర్ తీగను ఎత్తుకెళ్తుండడంతో తమ మోటార్లు ఎలా కాపాడుకోవాలో అర్థం కాక రైతులు ఆందోళన చెందుతున్నా రు. ఉగ్గంపల్లి శివారు మాలోత్ తండాకు చెందిన మాలోత్ రాజ్యా సాగుకు తన బావి నీరు సరిపోక అదే గ్రామానికి చెందిన రైతు శ్రీనివాస్ బావి అద్దెకు తీసుకున్నాడు. అందులో 3 హెచ్‌పీ మోటారు ఏర్పాటు చేసుకొని పంట పారించుకుంటున్నాడు. రూ.20 వేల విలువ చేసే మోటారు పగలగొట్టి అందులోని కాపర్ తీగను శుక్రవారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు మాయం చేశారు. బాధిత రైతు రాజ్యా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు మోటారు దొంగలను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

ప్రమాదవశాత్తు
కాల్వలో పడి వృద్ధురాలి మృతి

పర్వతగిరి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కాల్వలో పడి వృద్ధురాలు మృతి చెందిన ఘటన మండలంలోని హట్యాతండాలో జరిగింది. సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 13న బాదావత్ నేజి(78) దుస్తులు ఉతికేందుకు ఎస్సారెస్పీ కాల్వ వద్దకు వెళ్లింది. ఈ క్రమంలో కాలుజారి కాల్వలో పడి కొట్టుకుపోయింది. ఆమె మృతదేహం శుక్రవారం నెక్కొండ మండలంలోని బొల్లికొండ తండా వద్ద కన్పించింది. మృతురాలి కుమారుడు చంద్రు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్సై బోగం ప్రవీణ్ తెలిపారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

నెహ్రూసెంటర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మెస్పీ జిల్లా ఇంచార్జ్ గుగ్గిళ్ల పీరయ్య డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ సెంటర్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం రిలేనిరహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా పీరయ్య మాట్లాడారు. ఎస్సీల వర్గీకరణ అయ్యేంత వరకు ఉద్యోగ భర్తీని గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, రిటర్నింగ్ ఆఫీసర్ల ఉద్యోగాల భర్తీని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ రిలే నిరహార దీక్షలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు శాగంటి రమేష్‌మాదిగ, కందిపాటి బిక్షపతి, పులి సోమయ్య, శేషం కిరణ్, గుగ్గిళ్ల నవీన్, కంచనపల్లి ఉప్పలయ్య, ఏర్పుల రాజు, పొలవంగు సతీష్, బన్నీ, పాల్వాయి దిలీప్, మోటపల్లి చంటి, తప్పెట్ల సాయి, పోలెపంగు విజయ్, నిలుగొండ రాజేష్, మనోజ్, శ్రావణ్, మల్లేపాక వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ సెంటర్‌లో ఎమ్మార్పీఎస్ దీక్షలను ప్రారంభిస్తున్న ఎమ్మెస్పీ నాయకులు గుగ్గిళ్ల పీరయ్య

సామాజిక వర్గాల బలోపేతం కోసం కార్పొరేషన్లు

రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్

మహబూబాబాద్ టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అధిక జనాభా ఉన్న ముదిరాజ్‌ల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా ముదిరాజ్ కార్పోరేషన్ ఏర్పాటు చేశారని రాష్ట్ర ముదిరాజ్ కార్పోరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరుల మాట్లాడుతూ...రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సామాజిక వర్గాల బలోపేతం కోసం కార్పోరేషన్లను ఏర్పాటు చేసిందని చెప్పారు. రాష్ట్రంలో ముదిరాజులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కరిస్తానని చెప్పారు. గత ఏడాది జిల్లాలో కురిసిన భారీ వర్షాలతో మత్స్య సంపద కోల్పోవడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని చెప్పారు. రాష్ట్రంలో మహిళా మత్స్య కార్మికుల ఆర్థికాభ్యున్నతికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఫిషర్‌మెన్ కమిటీ అధికార ప్రతినిధి గొడుగు శ్రీనివాస్, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గుండ్లపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జగన్, దుండి వెంకటేశ్వర్లు, పిడుగు వెంకన్న, పెద్ది సైదులు, సందీప్, బాలాజీ, ఉప్పలయ్య, గోపాల్, వెంకన్న పాల్గొన్నారు.

వీరభద్రుడి సన్నిధిలో. జ్ఞానేశ్వర్ ప్రత్యేక పూజలు

కురవి : కురవి శ్రీ వీరభద్రస్వామి సన్నిధిలో తెలంగాణ ముదిరాజ్ కార్పోరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ శుక్రవారం ప్రత్యేక పూజలు జరిపారు. భద్రకాళి, వీరభద్రస్వామి ఆలయాల్లో మొక్కులు తీర్చుకున్న అనంతరం జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ముదిరాజులను అభివృద్ధి చేయాలనే ఉద్దేశ్యంతో సీఎం రేవంత్‌రెడ్డి తనను చైర్మన్‌గా నియమించారని, వీరభద్రుడి అనుగ్రహంతో రాష్ట్రంలోని ముదిరాజ్‌లకు వీలైనంతా సహాయ పడుతానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ అధికార ప్రతినిధి గొడుగు శ్రీనివాస్, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు గుండ్లపల్లి శ్రీనివాస్, కార్యదర్శి జగన్, దుండి వెంకటేశ్వర్లు, సూరబోయిన రవి, తురక గోపాల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్